క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ బంగారుగడ్డ ఫీడర్, 11కేవీ గాంధీనగర్ ఫీడర్, 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ లైన్ పనులు జరుగుతున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పి.మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బంగారుగడ్డ, సీతారాంపురం, గాంధీనగర్, కలల్‌వాడ, రాజీవ్‌చౌక్, డాక్టర్స్‌కాలనీ ప్రాంతాలలో ఉదయం 7గంటల నుంచి 9:30గంటల వరకు, రామచంద్రగూడం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్స్ పనులు జరుగుతున్న కారణంగా రామచంద్రగూడం, భాగ్యనగర్‌కాలని, శ్రీనగర్‌కాలనీ, చైతన్యనగర్, తాళ్లగడ్డ, రాంనగర్, చౌదరికాలనీ, ఏడుకోట్లతండా పరిసర ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఏఈ పి.మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు (5 ఎకరాల లోపు) రైతులు పండ్ల తోటల పెంపకానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కొండమల్లేపల్లి మండల ఎంపీడీఓ బాలరాజురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పది రకాలైన పండ్ల తోటల పెంపకానికి రైతులకు మూడేళ్ల వరకు ఖర్చులు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.5వేల పింఛన్ ఇవ్వాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నాయకులు

మిర్యాలగూడ : డప్పు, చెప్పు చర్మకారులకు ప్రభుత్వం రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ మాదిగ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ ఆ డిమాండ్ల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. డప్పు, చెప్పు కుట్టే వారికి రూ.5వేల పెన్షన్ అందించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందిపాటి ప్రభాకర్, మంద శ్రీనివాస్, పెదమాం వీరన్న, మంద పద్మ, వెల్లంల శంకర్‌యాదవ్, సంగం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ము కాస్తున్న విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ భవనంలో నిర్వహించిన బీసీ విద్యార్థి, యువజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 298 ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కారణమవుతున్న విద్యాశాఖ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం వలన పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు మురళియాదవ్, శిరసనగండ్ల ఈశ్వరాచారి, పున్నా రాములు, మహేశ్వర్ తదితరులున్నారు.

భూ ఆక్రమణ, దాడి కేసులో జరిమానా

నిడమనూరు : భూమి ఆక్రమించి దున్నుతుండగా ఎందుకు దున్నతున్నావు అడిగినందుకు కర్రతో దాడిచేసి గాయపరిచిన కేసులో నిడమనూరు సివిల్ జడ్జి కోర్టు రూ.500 జరిమానా , లే నెలరోజుల జైలు శిక్ష విధించారు. కేసు వివరాలను లైజన్ ఆఫీసర్ ఎస్కే అలీ అహద్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 10, 2017న మ మాడుగులపల్లి మండలం(పాతనిడమనూరు) ధర్మాపురం గ్రామానికి చెందిన బందారపు గిరిని పక్క పొలంకు చెందిన బందారపు దశరథ, మల్లికంటి లక్ష్మమ్మ, బందారపు తిరుపతయ్యలు గిరిని కర్రతో దాడి చేసి, గాయపరిచారు. దీంతో బాధితుడు గిరి నిందితులు దశరథ, లక్ష్మమ్మ, తిరుపతయ్యలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ బి యాదయ్య కేసు నమోదు చేసి, కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. శుక్రవారం నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి టీ స్వప్న సాక్షులను విచారించి నేరస్తులు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా, లేదానెలరోజుల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సాధన వాదనలు వినిపించారు.

ఆహ్లాదం కోల్పోతున్న పార్కులు

- నిర్వహణ లోపంతో పచ్చదనం కరువు
- విరిగిన ఆటవస్తులు
- దర్శనమిస్తున్న పిచ్చి మొక్కలు



వేంకటేశ్వరస్వామి టెంపుల్ సమీప పార్కులో విరిగిపోయిన ఆటవస్తువులు



బోటింగ్ పార్కులో శిథిలావస్థకు చేరిన ఆట వస్తువులు

మిర్యాలగూడ టౌన్ : రోజు రోజుకు అభివద్ధి జరుగుతున్న పట్టణంలోని పార్కులు ఆహ్లాదాన్ని కోల్పోతున్నాయి. ఆ పార్కులలో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తులు సరిగా లేకపోవడంతో పాటు మౌలిక వసతులు కరువయ్యాయి. పట్టణంలో సుమారు 14 పార్కులు ఉండగా మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపంతో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని కేవలం ఐదు పార్కులలోనే పిల్లలు ఆడుకునే విధంగా ఆటవస్తులను ఏర్పాటు చేశారు. ప్రధానంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో పార్క్, హౌసింగ్‌బోర్డులోని ట్యాంక్ వద్ద గల పార్కు ఎస్ఎస్‌పీ క్యాంపులోని సుందరయ్య పార్క్, చైతన్యనగర్ కాలనీలో గల బోటింగ్ పార్క్ వద్ద పిల్లల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకున్నారు. అదే విధంగా చైతన్యనగర్ కాలనీలో బోటింగ్ పార్క్ వద్ద పిల్లలకు ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. వాటిపై సరైన పర్యవేక్షణ లేని కారణంగా పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన కొన్ని ఆట వస్తువులు విరిగిపోయాయి. పార్క్‌లలో ఏర్పాటు చేసిన క్రీడా వస్తువులు ఎక్కడికక్కడి విరిగి పోవడంతో సెలవుల్లో పార్క్‌లకు వచ్చే పిల్లలు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా..

పట్టణంలోని కొన్ని పార్క్‌లు ఆకతాయిలకు అడ్డాగా మారింది. పార్క్‌ను పేకాటతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మార్చుకున్నారు. పలు పార్క్‌లలో సరైన వసతులు కల్పించకపోవడంతో పాటు పిల్లలు ఆడుకునే విధంగా ఆట వస్తువులు లేకపోవడంతో పార్క్‌లో ఎవరూ ఉండటం లేదు. కొంత మంది ఆకతాయిలు ఈ ప్రాంతాలను ఎంచుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రనే ప్రచారం సాగుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆట వస్తులను ఏర్పాటు చేయాలి

పట్టణంలోని ఏర్పాటు చేసిన పలు పార్క్‌లో కొన్ని వస్తువులు విరిగిపోగా, కొన్నింటిని దొంగిలించారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. కాగా ఈ పార్క్‌లలో నిర్వహణ లోపంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. సాయంత్రం 7, 8గంటల సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలి.

– నవీన్ , మిర్యాలగూడ

మరమ్మతులు చేయిస్తాం



పట్టణంలోని పార్క్‌ల్లో పిల్లల ఆట వస్తువులు విరిగిన మాట వాస్తవమమే. త్వరలో మరమ్మతులు చేయిస్తాం. మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా పార్క్‌లను ఆహ్లాదకరంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటాం. పార్క్‌ల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తా

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు అక్షరజ్ఞానంతో పాటు వారిని సామాజిక బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు . ఆయన వెంట ఎంఈఓ మాతృనాయక్, హరికృష్ణ, ఉపాధ్యాయులు, తదిత రులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బాలునాయక్ తన కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఆపద సమయాల్లో సీఎం సహాయనిధి ఆపన్నహస్తం లాంటిదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణ శిబిరం ఎమ్మెల్యే సందర్శన

కొండమల్లేపల్లి : మండల స్థాయిలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ శుక్రవారం సదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్ట్ అంశాలపై ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో అందిస్తున్న అంశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు శశిధర్, వి. వెంకట్‌రెడ్డి, కె.సతీష్, జి.దేవులయ్య, ఎ. అంజయ్య, రవికుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి : సబ్ కలెక్టర్



మిర్యాలగూడ : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



పెద్దవూర : రవిని సన్మానిస్తున్న ఎంఈఓ రాములు

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో బోధన సామర్థ్యం పెంచుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సహాయ, సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పాల్గొన్నారు.

ఆంగ్ల సామర్థ్యాలను పెంపొందించాలి

పెద్దవూర : విద్యార్థులలో ఆంగ్ల సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణలో నాలుగో రోజు శుక్రవారం పాల్గొని మాట్లాడారు. ఐదు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విధిగా పాటించాలని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ రవిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చర్ దైద రవి, జిల్లా రీసోర్స్ పర్సన్ ఇరుమాది పాపిరెడ్డి, నోడల్ అధికారి శేషు, ఎమ్మార్పీలు మేదరి దేవేందర్, దుర్గాప్రసాద్, నరేందర్, జుహెదాబేగం, నర్సింహా, కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వృత్యంతర శిక్షణ

నిడమనూరు : ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యేలా విద్యాబోధన మెరుగుపడాలని మండల విద్యాధికారి లావురి వెంకన్న ఉపాధ్యాయులకు సూచించారు. ఐదు రోజుల శిక్షణ తరగతులలో భాగంగా శుక్రవారం డిజిటల్ విద్యా బోధన, ఆటపాటలతో విద్యనందించడంపై మెళకువలను ఉపాధ్యాయులకు ఎంఈఓ, మాస్టర్ ట్రైయినర్స్ వివరించారు. ప్రతి సబ్జెక్టు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున బోధన మెళకువలను వివరించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని మెరుగైన బోధన అందించాలని ఎంఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు డి గౌతమ్, డీఆర్పీ సుదర్శన్, ఎమ్మార్పీలు జీ సైదులు, అంజయ్య, యాదిరెడ్డి, విజయలక్ష్మి, ఏడుకొండలు, పాంపాటి శ్రీను, కొమరాజు సైదులు, మేకల జాన్ రెడ్డి, పరమేష, శిక్షణలో 80 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని ఇతరులకు కేటాయించొద్దు

వేములపల్లి : మండల కేంద్రంలో ఉన్న జీపీఎస్ ఉర్దు మీడియం పాఠశాల భవనాన్ని ఇతరులకు కేటాయించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ భవనంలో ఉర్దు మీడియంతో పాటు తెలుగు మీడియం స్కూల్, అంగన్‌వాడీ అన్ని ఒక్కటే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారని, జీపీఎస్ ఉర్దు మీడియం స్కూల్‌కు రెండు గదులు కేటాయించారన్నారు. ఇందులో టీచర్లు, విద్యార్థులు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రెండు గదుల్లో కుదించి ఒకటే గదిని ఉర్దు మీడియం స్కూల్ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కేటాయిస్తున్నారని, దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులయ్యే అవకాశం ఉందని, వెంటనే అధికారులు స్పందించి భవనాన్ని కేవలం ఉర్దు మీడియం స్కూల్‌కే కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఉర్దు మీడియం శాల విద్యారథ్ల తల్లిదండ్రులు ఉన్నారు.



ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మిర్యాలగూడ నుంచి సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

మిర్యాలగూడ టౌన్ : భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు ఈనెల 25న మిర్యాలగూడ నుంచి సూపర్ లగ్జరి బస్సు ప్రత్యేకంగా నడిపిస్తున్నట్లు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నుంచి 25న సాయంత్రం 7గంటలకు బయలుదేరుతుందని, డిపో నుంచి పుష్కరాల వరకు పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.800 చార్జి ఉంటుందని తెలిపారు. ఈ రెండు రోజుల పాటు 30మంది భక్తులు ఉంటే ప్రత్యేకంగా బస్సులను నడిపిస్తామని తెలిపారు.సరస్వతి పుష్కర స్నానం, కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దర్శనం, ఘన్‌పూర్‌లోని ఘనేశ్వరాలయం, రామప్ప, వెయ్యి స్తంబాల గుడి, భద్రకాళి ఆలయం యాత్రలను చూడవచ్చని తెలిపారు. అదే విధంగా పుష్కరాలకు వెళ్లే వారు ఆన్‌లైన్ బుకింగ్ కూడా చేసుకోవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్లు – 929800 8888, 7036632277 ను సంప్రదించవచ్చన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రైతులు పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని హాలియా ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లికల్లు గ్రామంలోని రైతు వేదికలో కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్త రాములమ్మ మాట్లాడుతూ పంటల సాగులో యూరియా వాడకం, రసాయన మందుల పిచికారీ, పంట అవసరాల కొనుగోలులో రశీదులను భద్ర పర్చుకోవడం, సాగులో నీటి సద్వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ విత్తన అధికారి రాంబాబు జనుము, జీలుగ విత్తనాల ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ బాలకృష్ణ, ఏఈఓలు రామాంజనేయులు, శ్రీనివాస్, అనంతరెడ్డి పాల్గొన్నారు.

మానవ హక్కుల వేదికకు సుబ్బారావు రాజీనామా



మిర్యాలగూడ : ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం మావోయిస్టులను మట్టుపెడుతున్నప్పటికీ మానవ హక్కుల వేదిక మౌనంగా ఉండడంపై ఆ సంస్థ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ వేదిక మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సుబ్బారావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసుల కోసం పోరాడుతున్న మావోయిస్టులను కాల్చిచంపుతూ మట్టుపెడుతున్నప్పటికీ మానవ హక్కుల వేదిక మౌనం వహించడం క్షమించరానినదన్నారు. ఈ విషయమై హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్‌కుమార్‌తో మాట్లాడిన అనంతరం తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పదేళ్లపాటు పౌరహక్కుల సంఘంలో పనిచేసిన తాను 2001 నుంచి 15ఏళ్లగా మానవ హక్కుల వేదికలో వివిధ హోదాలో పనిచేసినట్లు తెలిపారు. 91ఏళ్ల వయస్సులో ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయినప్పటికీ అన్నికాల ప్రజా పోరాటాలకు మద్దతు తెలుపుతానన్నారు. మోదీ ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఆదివాసీలపై ప్రభుత్వ దమనకాండను ఆపివేసి వెంటనే చర్చలు చేపట్టాలని అన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని ఫిర్యాదు



అనాజిపురంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు

చింతపల్లి : మండల పరిధిలోని అనాజీ పురం గ్రామ సర్వే నంబర్‌లో 6లో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని శుక్రవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శితో పాటు తహసీల్దార్, ఎస్‌ఐలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 6 గ్రామానికి సమీపంలోని ఇసుక రీచ్ వద్ద ఉండడంతో 3రోజుల నుంచి ఈటచి, టిప్పర్లు, ద్వారా ఇసుకను సమీపంలో భారీ ఎత్తున డంపు చేస్తున్నారన్నారు. సర్వే నంబర్ 6లో ఇసుక తవ్వే ప్రాంతంలో శ్మశాన వాటిక ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు? మ పూర్వికుల సమాధులు కూడా ఇక్కడే ఉన్నాయని ఇసుక తొడడం ద్వారా తమ పూర్వికుల సమాధులు నిర్వీర్యం అవుతున్నాయని ఆరోపించారు. ఇసుక డంపు చేసే ప్రాంతంలో తమ పూర్వికుల సమాధులు ఉన్నందున అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సమాధులు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది.

కేజీబీవీ పనులు పూర్తయ్యేదెన్నడో!


- త్వరలో స్కూల్స్ ప్రారంభం
- నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణ పనులు
- ఆందోళనలో విద్యార్థులు



మాడుగులపల్లిలో నిర్మిస్తున్న కేజీబీవీ భవనం

మాడుగులపల్లి : మండల కేంద్రంలో నూతనంగా చేపడుతున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఎప్పుడు ప్రారంభమవుతుందోనని విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. వేసవి సెలవులు సైతం ముగుస్తున్నా ఇప్పటివరకు నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ఎప్పుడు ప్రారంభిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మాడుగులపల్లి కేజీబీవీని గతంలో వేముపల్లి మండలంలోని శెట్టిపాలెంలో నాలుగేళ్లు, తిప్పర్తి కేజీబీవీ భవనంలో ఒక సంవత్సరం నిర్వహించగా తిరిగి వేములపల్లి మోడల్ స్కూల్‌లో నాలుగు నెలలు నిర్వహించారు. ప్రస్తుతం మిర్యాలగూడ మండంలోని శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహిస్తున్నారు. మాడుగులపల్లి కేజీబీవీకి సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇతర చోట్లకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో చేపడుతున్న కేజీబీవీ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



మాడుగులపల్లి కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని అధికారులు త్వరగా పూర్తి చేయాలి. సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టిసారించి ఈ విద్యా సంవత్సరం నుంచే భవనం అందుబాటులో వచ్చేలా కృషి చేయాలి.

– సైదులు, విద్యార్థిని తండ్రి

రెండు నెలల్లో పూర్తవుతుంది

మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు ఈ విద్యా సంవత్సరంలో జూన్, జూలై నాటికి పూర్తవుతాయి. ఇప్పటికీ 90శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి నూతన భవనంలో విద్యారుఓథలకు విద్యాబోధన జరుగుతుందని అంచనా వేస్తున్నాం.

– వెంకటమ్మ, ఎంఈఓ

మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత మహిళలదే



ఉమెన్స్ ఫర్ ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

మిర్యాలగూడ టౌన్ : నాటిన మొక్కలను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్క మహిళపై ఉందని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని చెరువు వద్ద ఉమెన్స్ ఫర్ ట్రీ అనే కార్యక్రమంలో భాగంగా అమృత్ 2.0 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెరువు పరిధిలోని మహిళ సంఘాల సభ్యులందరూ ఒక్కొక్క మొక్కను నాటడంతో పాటు వాటి సంరక్షణ అవశ్యకతో పాటు విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మెప్మా డీఎంసీ శివాజీ, సీవో పోతేపాక బక్కయ్య, సీవోలు, ఆర్‌పీలు, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



పూజలు నిర్వహిస్తున్న లింగారెడ్డి

పెద్దవూర : దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. మండలంలోని కాంసానిగూడెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దేవాలయాలు ఐకమత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాలియా ఏఎంసీ వైస్ చైర్మన్ కంసాని చంద్రశేఖర్, గ్రామస్తులు కాంసాని కృష్ణయ్య, తిరుమల్, వెంకటయ్య, నాయకులు పగడాల నాగరాజు పాల్గొన్నారు.

మసీదు మండల కమిటీ ఎన్నిక

పెద్దవూర : మండల కేంద్రంలోని జామే మసీదులో మసీదు మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎంఏ మోబీన్, ఉపాధ్యక్షుడిగా ఎండీ.ఇబ్రహీం, కోశాధికారిగా ఎండీ. హైమద్‌అలీ, కార్యదర్శిగా ఎస్‌కే అక్బర్, కమిటీ సభ్యులుగా ఎండీ. రహీం, ఎండీ.జానీ, షరీఫ్, యూసుఫ్, ఎండీ.షబ్బీర్, ఇబ్రహీం మదీనా, రహీం, సత్తార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మోబీన్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ముస్లింలకు అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు.

సందేశమిచ్చేలా.. స్ఫూర్తి నింపేలా!





మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ఖమ్మం రోడ్డులో ప్రహరీలపై వేసిన సందేశాత్మక చిత్రాలు మున్సిపాలిటీ ప్రజలను ముగ్ధులను చేస్తున్నాయి. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఈ పేయింటింగ్ ఉంది.

– మిర్యాలగూడ టౌన్